క్లుప్తంగా

పోలీస్ కిష్టయ్యకు నివాళి



కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ మలిదశ అమరవీరుడు పోలీస్ కిష్టయ్యముదిరాజ్ (పుట్టకొక్కుల కిష్టయ్య) 14వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి శుక్రవారం నల్లగొండ పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బోళ్ల వెంకట్‌ముదిరాజ్, కేశబోయిన శంకర్‌ముదిరాజ్, అంజయ్యముదిరాజ్, వెంకటేశ్వర్లు, గంగరబోయిన నరసింహ, అంజి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న లారీ డ్రైవర్లు

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మందుగుల యాదయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో యాదయ్య వైద్య చికిత్స ఖర్చులకుగాను ఆ గ్రామంలోని లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 35 మంది లారీ డ్రైవర్స్ వద్ద రూ.38 వేలు సేకరించి శుక్రవారం యాదయ్యకు అందజేశారు. యాదయ్య కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ క్యార్యక్రమంలో లారీ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

‘మునుగోడు’లో పెరిగిన పోలింగ్ శాతం

- నియోజకవర్గ వ్యాప్తంగా 91.89 శాతం పోలింగ్
- మెజార్టీపై ఎవరి ధీమా వారిదే



ఓటు హక్కు వినియోగించుకునేందుకు మునుగోడులో క్యూలో నిలబడిన ఓటర్లు (ఫైల్)

మునుగోడు : నవంబర్ 30వ తేదీన జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గతంలో ఎప్పుడు లేని విధంగా మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఓటర్లు అధిక శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. మునుగోడు నియోజకవర్గం 1967లో ఏర్పాటు కాగా అప్పుడు జరిగిన ఎన్నికల్లో 63.93 శాతం పోలింగ్ నమోదయింది. ఎన్నికలు జరిగిన ప్రతిసారి 60 నుంచి 76 శాతం వరకు పోలింగ్ నమోదయింది. కాగా 2014లో 82.14 శాతం, 2018లో 91.30 శాతం పోలింగ్ నమోదయింది. అయితే గురువారం జరిగిన ఎన్నికల్లో ఊహించని రీతిలో 91.89 శాతం పోలింగ్ నమోదయింది. 2022 నవంబర్ 3న జరిగిన మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో మూడు పార్టీల నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అప్పుడు 93 శాతం పోలింగ్ నమోదయింది. 2023 నవంబర్ 30న జరిగిన సాధారణ ఎన్నికల్లో గతంలో కంటే అధికంగా పోలింగ్ నమోదై నల్లగొండ జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. అధిక సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో ఓటర్లు ఎవరికి వేసి ఉంటారనే ప్రశ్న ప్రతి ఒక్కరిలో మొదలైంది.

ఓటు వినియోగించుకున్న 2,31,197 మంది

మునుగోడు నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉండగా.. మొత్తం 2,52,648 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. వారిలో ఈ ఎన్నికల్లో 2,31,197 మంది ఓట్లు వేశారు. అందులో స్త్రీలు 1,15,082, పురుషులు 1,16,114 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మునుగోడు మండలంలో మొత్తం 36,816 మంది ఓటర్లు ఉండగా 33,825 మంది ఓట్లు వేశారు. 91.88 శాతం పోలింగ్ నమోదయింది. చండూరులో 34,619 మంది ఓటర్లకు 31,694 మంది వేయగా 91.55 శాతం, మర్రిగూడలో 26,580 మంది ఓటర్లకు 26,171 వేయగా 88.48 శాతం, చౌటుప్పల్‌లో 62,869 మంది ఓటర్లకు 58,153 మంది ఓటు వేయగా 92.50 శాతం, సంస్థాన్ నారాయణపురం మండలంలో మొత్తం ఓట్లు 38,542 ఉన్నాయి. అందులో పురుషులు 19390, స్త్రీలు 19152 ఉన్నారు. మొత్తం 35521 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 18,049, స్త్రీలు 17,472 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 92.16 శాతం పోలింగ్ నమోదయింది. నాంపల్లిలో 35,122 మంది ఓటర్లకు 32,129 మంది ఓటు వేయగా 91.48 శాతం, గట్టుప్పల్ 15,100 మంది ఓటర్లకు 13,704 మంది ఓటు వేయగా 90.75 శాతం పోలింగ్ నమోదయింది. మర్రిగూడ మండలంలో తప్ప మిగతా ఆరు మండలాల్లో 90 శాతంకు పైగా పోలింగ్ నమోదయింది.

ఎవరి ధీమా వారిదే..

పెరిగిన ఓటింగ్ శాతంతో ఆ ఓట్లు తమకే కలిసి వస్తాయని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న తమకు అధికంగా ఓట్లు వస్తాయని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతోపాటు ఏడాది క్రితం మునుగోడులో ఉప ఎన్నిక తీసుకొచ్చి నియోజకవర్గ అభివృద్ధికి దోహద పడిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అధికంగా ఓటు వేశారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా ఈ నెల 3న వెలువడనున్న ఫలితాల్లో పెరిగిన ఓట్ల శాతం ఎవరికి లాభం చేకూర్చిందో తేలనుంది.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



మునుగోడులోని ప్రాచీన శివాలయంలో పూజలు చేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: దేశంలోని పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడులోని ప్రాచీన శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ నియంత పాలనను అంతమొందించాలనే ఆలోచనతో యువతీయువకులు, ఉద్యోగులు ఉన్నారన్నారు. వారి ఆలోచనను గురువారం జరిగిన ఎన్నికల్లో అమలుచేసి బీఆర్ఎస్ నాయకులను ఇంటికి పంపించే పనిచేశారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు 80 మందికిపైగా భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని గెలిపించబోతున్నారని, ఇక కేసీఆర్ కుటుంబం ప్రగతి భవన్ ఖాళీ చేయక తప్పదన్నారు. డిసెంబర్ 4న కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన వెంటనే ఎన్నికల సందర్భంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలుచేసి తీరుతుందన్నారు. మునుగోడు నియోజకవర్గ ఓటర్లు తనకు ఓట్లు వేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మేకల ప్రమోద్‌రెడ్డి, పందుల భాస్కర్, ఎండీ అన్వర్, పాల్వాయి జితేందర్ రెడ్డి, జంగిలి నాగరాజు, మునుగోటి సాయి, జిట్టగోని సైదులు, సులేమాన్ తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



నల్లగొండ: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ షేక్ సుల్తానా

నల్లగొండ: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నల్లగొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ సుల్తానా అన్నారు. వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్ సుల్తానా విద్యార్థులు, అధ్యాపకులతో హెచ్ఐవీ నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హెచ్ఐవీ రోగులకు మానసిక ధైర్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్.హిమజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మణెమ్మ, అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



మర్రిగూడ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎయిడ్స్ నిర్మూలనే ధ్యేయం

మర్రిగూడ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యాధికారులు, సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణే ధ్యేయంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఎయిడ్స్‌ను నిర్మూలించాలని నినాదాలు చేశారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండాలిని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్‌నాయక్, ఆర్ఎంఓ అరుణతార, దీపక్, తిరుమలాచారి, ప్రేమానంద్, ప్రేమ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యడవల్లి యూత్ ఆధ్వర్యంలో..



కనగల్ : అవగాహన కల్పిస్తున్న దోటి సైదులు

కనగల్ : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని యడవల్లి గ్రామంలో యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ గౌరవ అధ్యక్షుడు దోటి సైదులు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి రక్త మార్పిడి ద్వారా, అక్రమ సంబంధాల వల్ల వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ప్రజలందరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యడవల్లి యూత్ సభ్యులు కొర్వి శ్రీనివాస్, ఏర్పుల స్వాతి రామ్, భోగరాజు శ్రీను, పోలె రమేష్ పాల్గొన్నారు .

భక్తిశ్రద్ధలతో లక్ష తులసీ దళార్చన



నేరడ గ్రామంలోని ఆలయంలో శ్రీ సీతారామాంజనేయస్వామి విగ్రహాలు

చిట్యాల: తిరు నక్షత్రం సందర్భంగా మండలంలోని నేరడ గ్రామంలో గల శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష తులసీ దళార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శ్రీ సీతారామంజనేయస్వామి విగ్రహాలకు తులసీ దళాలతో ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అర్చకులు పాండురంగాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాపోలు యాదగిరి, ముషం రామస్వామి, పిల్లల మర్రి లక్ష్మయ్య, చెరుపల్లి గోవర్ధన్, గుర్రం భిక్షం, ముషం శ్రీనివాస్, పులిపాటి శ్రీనివాస్, ఆనందం వరదయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్యమే విజయం సాధిస్తుంది

- నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం



మాట్లాడుతున్న వేముల వీరేశం

నకిరేకల్ : ప్రజలు మార్పు కోరుకున్నారు.. అసత్యానికి, సత్యానికి జరిగిన ఈఎన్నికల్లో సత్యమే విజయం సాధించబోతుందని నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను బీఆర్ఎస్ అభ్యర్థిపై భారీ మెజార్టీతో గెలవబోతున్నానని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక ఈప్రాంత ప్రజల కోసం ఎమ్మెల్యేగా కాకుండా ఒక పనిమనిషిలా సేవ చేస్తూ నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ బలమైన శక్తిగా ఎదిగేలా ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 కు 12 సీట్లు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతుందని, డిసెంబర్ 9 న సోనియమ్మ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణలో అధికారం చేపట్టి సోనియాగాంధీకి కానుక ఇవ్వబోతున్నామన్నారు. తన గెలుపు కోసం కష్టపడిన కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. తన గెలుపు కోసం కృషి చేసిన నేతలకు, కార్యకర్తలకు, ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈసమావేశంలో దైద రవీందర్, మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, పూజర్ల శంభయ్య, ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, గాజుల సుకన్య, నకిరేకంటి ఏసుపాదం, పన్నాల రాఘవరెడ్డి, యానాల లింగారెడ్డి, యాస కరుణాకర్‌రెడ్డి, మాద యాదగిరి, బొజ్జ సుందర్, దూదిమెట్ల సత్తయ్య, కొండ వెంకన్నగౌడ్, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడలో 83.49శాతం పోలింగ్ నమోదు

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
మాడ్గులపల్లి	14869	13543	91.08
వేములపల్లి	20215	18328	90.67
మిర్యాలగూడ	142676	114467	80.23
దామరచర్ల	39439	34306	86.98
అడవిదేవులపల్లి	14192	12541	88.37

మిర్యాలగూడ : మిర్యాలగూడ శాసనసభకు జరిగిన ఎన్నికల్లో పోలింగ్ 83.49 శాతం నమోదైంది. నియోజకవర్గంలో 2,31,391మంది ఓటర్లు ఉండగా 1,93,185 మంది తమ ఓటు హక్కు వినయోగించుకున్నారు. అత్యధికంగా మాడుగులపల్లి మండలంలో 91.08 శాతం నమోదు కాగా, అత్యల్పంగా మిర్యాలగూడలో 80.23 శాతం పోలింగ్ నమోదైంది.

దేవరకొండలో 84.49 శాతం ..

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
చింతపల్లి	42,064	36,615	87.0
దేవరకొండ	55,989	45,378	81.02
కొండమల్లేపల్లి	27,558	22,490	81.61
గుండ్లపల్లి	39146	33,405	85.3
నేరేడుగొమ్ము	19,290	16,893	87.0
చందంపేట	29,434	25,120	87.0
పీఏపల్లి	38,141	32,891	86.23

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 2,51,266 మంది ఓటర్లు ఉండగా 2,12,593 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 84.49 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇందులో 1,08,586 మంది పురుషులు ఉండగా1,03,999మంది మహిళా ఓటర్లు ఉన్నారు.ఇతరులు 8మంది ఓటును వినియోగించుకున్నారు. 2018లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కంటే ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కొంత మేర తక్కువ శాతం పోలింగ్ నమోదైనట్లు తెలుస్తుంది. 2018లో 85.98శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుతం 84.49శాతం ఓట్లు పోలయ్యాయి.

సాగర్‌లో 85.79 శాతం..

మండలం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
అనుముల	35965	30733	85.45
తిరుమలగిరి	34075	29914	87.79
త్రిపురారం	35957	31159	86.66
నిడమనూరు	35636	31055	87.15
మాడుగులపల్లి	7631	7081	92.79
పెద్దవూర	46354	36702	79.18
గుర్రంపోడు	37794	33591	88.88

హాలియా : నాగార్జున సాగర్ నియోజకవర్గ వ్యాప్తంగా 2,33,412 మంది ఓటర్లకుగాను 2,00235 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 99557 కాగా మహిళలు 100665 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. దీంతో 85.79 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 2018 ఎన్నికల్లో నియోజకవర్గంలో 86.18 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈ సారి 85.79 శాతం ఓటింగ్ నమోదైయ్యింది. ఆ ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో కొంత మేరకు ఓటింగ్ శాతం తగ్గింది. ఓటింగ్ శాతంలో సాగర్ నియోజకవర్గంలోని మాడుగులపల్లి మండలం మొదటి స్థానంలో నిలిచింది. ఈ మండలంలో 7631 మంది ఓటర్లు ఉండగా గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో 7081 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకొని 92.79 శాతం నమోదు చేసింది. పెద్దవూర మండలంలో 46354 మంది ఓటర్లు ఉండగా 36702 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకొని అత్యల్పంగా 79.18 శాతం పోలింగ్ నమోదైంది.

ఎన్నికలు పకడ్బందీగా జరిగాయి

రామగిరి(నల్లగొండ): తెలంగాణ ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యల వల్ల అసెంబ్లీ ఎన్నికలు పక్బందీగా జరిగాయని ఎలక్షన్ వాచ్ కమిటీ సభ్యుడు బొమ్మరబోయిన కేశవులు అన్నారు. శుక్రవారం ఆయన నల్లగొండ పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా పని చేయడం వల్లనే ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీహరి, శ్రీనివాసరావు, సింగారపు మల్లయ్య, నన్నూరి లింగారెడ్డి, కట్ట శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొమ్మరబోయిన కేశవులు

నల్లగొండ నియోజకవర్గంలో 81.60 శాతం



ఓటు వేయడానికి క్యూలో నిల్చున్న ఓటర్లు (ఫైల్)

నల్లగొండ: నల్లగొండ నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా 81.60 శాతం పోలింగ్ నమోదయింది. నల్లగొండ నియోజకవర్గంలో మొత్తం 284 పోలింగ్ కేంద్రాలు ఉండగా 2,44,460 మంది ఓటర్లున్నారు. ఇందులో మహిళలు 1,24,972 మంది, పురుషులు 1,19,434 మంది ఉన్నారు. 54 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 1,99,231 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,01,866 మంది మహిళలు, 97,328 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా 37 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కనగల్ మండలంలో మొత్తం ఓటర్లు 35,674 మంది ఓటర్లుండగా అందులో 32,779 మంది ఓటు వినియోగించుకోగా 91.88 శాతం పోలింగ్ నమోదయింది. మాడ్గులపల్లి మండలంలో 7340 మంది ఓటర్లకు 6475 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 88.22 శాతం పోలింగ్ నమోదయింది. నల్లగొండ మండలం, మున్సిపాలిటీలో 1,72,246 మంది ఓటర్లుండగా 1,33,771 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 77.63 శాతం పోలింగ్ నమోదయింది. అదేవిధంగా తిప్పర్తి మండలంలో 29,208 మంది ఓటర్లుండగా 26,266 మంది ఓటు హక్కు వినియోగించుకోగా 89.95 శాతం పోలింగ్ నమోదయింది.

నకిరేకల్ నియోజకవర్గంలో తగ్గిన పోలింగ్ శాతం



నకిరేకల్ : స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను భద్రపరిచి సీల్ వేసిన గది ఎదుట ఆర్ఓ, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, అధికారులు

- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 88.90
- ప్రస్తుతం 86.67 శాతం నమోదు
- స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన ఈవీఎంలు

నకిరేకల్ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నకిరేకల్ నియోజకవర్గంలో 2018 ఎన్నికలతో పోల్చితే పోలింగ్ శాతం తగ్గింది. గురువారం జరిగిన ఎన్నికల్లో 86.67 శాతం పోలింగ్ నమోదయింది. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, చిట్యాల, కేతేపల్లి, రామన్నపేట, కట్టంగూరు, నార్కట్‌పల్లి మండలాల్లో మొత్తం 2,50,547 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,24,668, మహిళలు 1,25,876 మంది, ట్రాన్స్‌జెండర్ ముగ్గురు ఉన్నారు. 305 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం నియోజకవర్గ వ్యాప్తంగా 2,17,149 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 86.67 శాతం పోలింగ్ నమోదయింది. 2009 ఎన్నికల్లో 76 శాతం నమోదు కాగా 2014 ఎన్నికల్లో 79.72 శాతం.. 2018 ఎన్నికల్లో 88.90 శాతం పోలింగ్ నమోదయింది.

స్ట్రాంగ్ రూంకు చేరిన ఈవీఎంలు

నకిరేకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గురువారం అర్ధరాత్రికి వివిధ గ్రామాల్లో ఓటింగ్‌కు వినియోగించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) చేరుకున్నాయి. ఇక్కడి నుంచి నల్లగొండలోని దుప్పలపల్లిలో గల స్ట్రాంగ్ రూంకు తరలించారు.

1983 నుంచి ఇప్పటివరకు నకిరేకల్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం

సంవత్సరం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
1983	1,02,676	73,098	71.19
1985	1,15,449	81,798	70.85
1989	1,40,827	1,06,681	75.75
1994	1,43,670	1,06,577	74.18
1999	1,49,879	1,18,742	79.22
2004	1,56,467	1,18,216	75.7
పునర్విభజన తరువాత			
2009	2,21,383	1,68,160	76.00
2014	2,25,426	1,78,049	79.72
2018	2,27,271	2,01,119	88.90
2023	2,50,547	2,17,149	86.67

పోలింగ్ శాతం ఇలా..

1983 నుంచి వరుసగా నకిరేకల్ నియోజకవర్గంలో ప్రతి ఎన్నికల్లో 70 శాతాన్ని మించి పోలింగ్ నమోదవుతూ వస్తోంది. ఈసారి గత ఎన్నికల కంటే రెండు శాతం పోలింగ్ తగ్గింది. ఇప్పటివరకు 15సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా 1957లో 59.4 శాతం , 1999లో 79.22శాతం, 2004 ఎన్నికల్లో 75.7 శాతం పోలింగ్ నమోదయింది. నియోజకవర్గ పునర్విభజన అనంతరం 2009 ఎన్నికల్లో 76 శాతం పోలింగ్ నమోదు కాగా. 2014 ఎన్నికల్లో 79.72 శాతం, 2018లో 88.90 శాతం నమోదయింది. 2023 ఎన్నికల్లో 86.67 శాతం పోలింగ్ నమోదయింది.

ప్రమాదకరంగా లోలెవల్ బ్రిడ్జి !

- బ్రిడ్జి మధ్యలో ఏర్పడిన గొయ్యి
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు



శాలిగౌరారం బస్టాప్ సమీపంలో లోలెవల్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి

శాలిగౌరారం: నకిరేకల్–గురుజాల ప్రధాన రోడ్డుపై శాలిగౌరారం బస్టాప్ సమీపంలో ఉన్న లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గొయ్యి అత్యంతం ప్రమాదకరంగా మారింది. నకిరేకల్–గురుజాల రోడ్డు మండల కేంద్రంతో పాటూ ఇటు నకిరేకల్‌కు అటు మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి మండలాలకు అనుసంధానంగా ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం వందలాది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. మండల కేంద్రంలోని ప్రధానరోడ్డుపై ఉన్న ఈ లోలెవల్ బ్రిడ్జి ఇరుకుగా ఉండడంతో ఈ లోలెవల్ బ్రిడ్జిపై ప్రయాణించే సమయంలో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ఇరుకు లోలెవెల్ బ్రిడ్జిపై భారీ గొయ్యి ఏర్పడడంతో వాహనదారులు పడే బాధలు అన్నీఇన్నీ కావు.

ప్రమాద నివారణ చర్యలు చేపట్టని అధికారులు

ప్రస్తుతం మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండడంతో ధాన్యం లోడ్లతో లారీలు వెళ్లే క్రమంలో సంబంధిత వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి సమీపంలోకి వచ్చేవరకు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాద బారిన పడుతున్నారు. లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి వల్ల పగటిపూటే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారంటే ఇక రాత్రి వేళల్లో పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉంటుందో ఊహించవచ్చు. ఇప్పటికే అనేకమంది వాహనదారులు ఈ బ్రిడ్జిపై ప్రమాదాలబారిన పడ్డారు. బ్రిడ్జిపై ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం, ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలను అధికారులు చేపట్టకపోవడం గమనార్హం. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని బ్రిడ్జిపై ఏడిన గొయ్యిని పూడ్చి ప్రమాదాలను నివారించాలని శాలిగౌరారం మండల ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బంది

బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యి పరిమాణం పెరిగితే బ్రిడ్జి కొంతమేర కూలిపోయే ప్రమాదం ఉంది. అదే జరిగితే శాలిలింగోటం, అంబారిపేట, రామగిరి, గురుజాల, మనిమద్దె, రామాంజాపురం, ఉప్పలంచ, తుడిమిడి, చిత్తలూరు గ్రామాలతోపాటూ మోత్కూరు, అడ్డగూడూరు, తిరుమలగిరి మండలాలకు రాకపోకలు నిలిచిపోనున్నాయి.

ప్రమాదాలకు గురవుతున్నాం



శాలిగౌరారం మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద ఉన్న లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన భారీ గొయ్యి అత్యంత ప్రమాదకరంగా మారింది. రాత్రివేళల్లో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అధికారులు స్పందించి లోలెవెల్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యిని పూడ్చివేసి వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా నివారించాలి.

\- చిరబోయిన పరమేశ్, రామగిరి

అధికారుల వైఫల్యంతోనే ప్రజలకు అవస్థలు



మండల కేంద్రంలోని బస్టాప్ సమీపంలో ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై ఎంతోకాలంగా రోడ్డు దెబ్బతిని కుంగిపోయింది. సంబంధిత అధికారులు దెబ్బతిన్న రోడ్డుపై పటిష్ట మరమ్మతులు చేయకుండా తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. దీంతో బ్రిడ్జి రోడ్డు ప్రమాదకరంగా మారింది. అధికారుల వైఫల్యం వల్ల ప్రజలు అవస్థలకు గురికాక తప్పడం లేదు.

\- గోదల వెంకట్‌రెడ్డి, శాలిగౌరారం

దివీస్ పరిశ్రమలో రక్తదాన శిబిరం

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధి లింగోజిగూడెం గ్రామంలోని దివీస్ పరిశ్రమలో శుక్రవారం దివీస్ పరిశ్రమ జనరల్ మేనేజర్ సత్యచంద్రదివి వర్ధంతిని పురస్కరించుకుని మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో దివీస్ అథరైజెడ్ ఆఫీసర్ వి.వి.ఎల్ నర్సింహ్మారావు, వైస్ ప్రెసిడెంట్లు రామకృష్ణ, హేమంత్, పెండ్యాల శ్రీనివాస్, జనరల్ మేనేజర్‌లు పెండ్యాల సుధాకర్, తారక సత్యప్రసాద్, బాలకిషోర్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ కో–ఆర్డీనేటర్, సావిత్రి, వైద్యులు నరేంద్ర, ఎన్‌సీవీ.రాములు తదితరులు పాల్గొన్నారు.